గూడ్స్ రైల్లో ఎలక్ట్రిక్ ఆటోలు

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ తొలిసారిగా గూడ్స్ రైలు (ఎన్ఎంజీ రేకుల) ద్వారా ఎలక్ట్రిక్ ఆటోలు రవాణా చేశామని రైల్వే అధికారులు వెల్లడించారు. ఈ రవాణా ద్వారా రైల్వేకు ఏక కాలంలో రూ. 17.50 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. హైదరాబాద్ బాలానగర్ రైల్వే స్టేషన్ నుంచి ఢిల్లీలోని బిజ్వాసన్ రైల్వే స్టేషన్ వరకు 1,770 కిలో మీటర్లు ఆటోలను రవాణా చేసినట్టు డీఆర్ఎం లోకేశ్ విష్ణోయ్ తెలిపా తెలిపారు. ప్రయాణికులకు సంబంధించిన కొన్ని బోగీలను ఎన్ఎంజీలుగా మార్చి వాటి ద్వారా కార్లు, ఆటోలు, మోటర్ సైకిళ్లు, స్కూటర్ల తోపాటు తేలికపాటి వాణిజ్య వాహనాలు కూడా రవాణా చేయనున్నట్టు పేర్కొన్నారు.

ఆటోకు పండుగ కిక్కు

న్యూఢిల్లీ, నవంబర్ 15: దేశీయ ఆటోమొబైల్ సంస్థలకు పండుగ సీజన్ కలిసొచ్చింది. ఈసారి 42 రోజుల పాటు సాగిన పండుగ సీజన్‌లో 42.88 లక్షల యూనిట్ల వాహనాలు అమ్ముడయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో అమ్ముడైన 38,37,040 వాహనాలతో పోలిస్తే 12 శాతం అధికమయ్యాయని డీలర్ల అసోసియేషన్ ఫాడా వెల్లడించింది. నవరాత్రి ఉత్సవాలతో ప్రారంభమైన పండుగ సీజన్ దీపావళి వరకు కొనసాగిందని, ఈ సమయంలో 42.88 లక్షల యూనిట్ల వాహనాలు రిజిస్టార్ అయ్యాయని ఫాడా ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ తెలిపారు. ప్యాసింజర్ వాహన రిటైల్ 7 శాతం పెరిగి 6,03,009 యూనిట్లకు చేరుకోవడం కలిసొచ్చిందన్నారు. పండుగ సీజన్‌తోపాటు పలు సంస్థలు భారీగా రాయితీలు ఇవ్వడం కూడా విక్రయాలు పెరగడానికి దోహదం చేశాయన్నారు. దక్షిణాదిలో అకాల భారీ వర్షాలు కురియడంతో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో వాహన అమ్మకాలు పెద్దగా పెరగలేదన్నారు. అమ్ముడైన వాహనాల్లో ద్విచక్ర వాహనాలు 14 శాతం పెరిగి 33,11,325 యూనిట్లకు చేరుకోగా, కమర్షియల్ వాహన సేల్స్ 1 శాతం పెరిగి 1,28,738లకు, త్రిచక్ర వాహన సేల్స్ 7 శాతం అధికమై 1,59,960కి చేరుకున్నాయి. కానీ, ట్రాక్టర్ల అమ్మకాలు 2 శాతం తగ్గి 85,216 యూనిట్లకు పడిపోయాయి.

గోల్డ్‌కు ట్రంప్ గుబులు

- దేశీయ విపణిలో క్రమేణా క్షీణిస్తున్న ధరలు
- గత 10 రోజుల్లో తులం రూ.5,350 తగ్గుదల
- అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపుతో మార్కెట్ రివర్స్‌గేర్

న్యూఢిల్లీ, నవంబర్ 15: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం.. గోల్డ్ మార్కెట్ పతనానికి దారితీస్తున్నది. ఈ నెల 4న ట్రంప్ గెలిచినట్టు అధికారికంగా వెల్లడైన విషయం తెలిసిందే. అయితే అప్పట్నుంచి ఇప్పటిదాకా దేశీయ విపణిలో 10 గ్రాముల 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) బంగారం ధర రూ.5,350 (6.5 శాతం) పడిపోవడం గమనార్హం. డాలర్ ఇండెక్స్ (డీఎక్స్‌వై) అంతకంతకూ బలపడుతుండటం.. బులియన్ మార్కెట్‌ను బేరిష్ ట్రెండ్‌లోకి నెడుతున్నది. ప్రస్తుతం తులం రూ.77వేల దరిదాపుల్లో ఉన్నది. గత నెలాఖరున మునుపెన్నడూ లేనివిధంగా రూ.82,400 పలికిన సంగతి విదితమే. హైదరాబాద్‌లో తులం 22 క్యారెట్ రేటు రూ.70వేలకు పడిపోయింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది చివరిదాకా డౌన్‌ట్రెండ్ కొనసాగవచ్చన్న అంచనాలే వినిపిస్తున్నాయి. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టాక, పాలసీ నిర్ణయాలు వచ్చేదాకా గోల్డ్ రేట్ కరెక్షన్ ఉంటుందంటున్నారు.

ఎందుకింత ఒత్తిడి?

గత 10 రోజులుగా బంగారం ధరలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. బహిరంగ మార్కెట్‌తోపాటు కమోడిటీ ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లోనూ ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తున్నది. గతంలో అమెరికా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ట్రంప్ విధానాలను గమనిస్తే.. ఆ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు అనేక చర్యలు చేపట్టారు. అమెరికాకు చైనా నుంచి వచ్చే వస్తూత్పత్తులపై అధిక సుంకాలు విధించడం, వీసా విధానాన్ని కఠినతరం చేయడం వంటివి వీటిలో ఉన్నాయి. మళ్లీ జనవరి నుంచి ఆయనే అధ్యక్షుడిగా రానుండటంతో అమెరికా ఎకానమీపై ముఖ్యంగా ఆ దేశ కరెన్సీ డాలర్‌కు ఎక్కడలేని డిమాండ్‌ను తెచ్చిపెడుతున్నది. దీంతో పెట్టుబడులన్నీ స్టాక్స్, బాండ్ల మార్కెట్ వైపు వెళ్లిపోతున్నాయి. ఫలితంగా పసిడికి ఆదరణ తగ్గి ధరల క్షీణత చోటు చేసుకుంటున్నది.

ప్రభావితాంశాలివే..

బిట్‌కాయిన్

బిట్‌కాయిన్‌పట్ల మదుపరులు చూపిస్తున్న అమితాసక్తి కూడా గోల్డ్ మార్కెట్ క్రాష్‌కు దారితీస్తున్నది. ఈ వర్చువల్ కరెన్సీకి అమెరికా మద్దతు ఉండబోతుందన్న అంచనాలే ఇందుకు కారణం. ఈ క్రమంలోనే తరలివస్తున్న పెట్టుబడులతో మళ్లీ ఆల్‌టైమ్ హైల్లోకి బిట్‌కాయిన్ విలువ వెళ్లింది. ప్రస్తుతం విలువ 89వేల డాలర్లపైనే పలుకుతున్నది.

ఈక్విటీ మార్కెట్లు

స్టాక్ మార్కెట్లలో నష్టాలను, ఒడిదొడుకులను తట్టుకొనేందుకు ఇన్వెస్టర్లు ఎంచుకొనే సురక్షిత పెట్టుబడి మార్గమే బంగారం. అయితే ప్రస్తుతం మారిన ట్రెండ్‌తో ఇన్నాళ్లూ పెట్టిన పెట్టుబడులను గోల్డ్ మార్కెట్ నుంచి మదుపరులు వెనక్కి తీసుకుంటున్నారు. రిస్క్ ఎక్కువగా ఉన్నా ఈక్విటీల్లోనే ఇన్వెస్ట్ చేసేందుకు సిద్ధమైపోతున్నారు. ఈటీఎఫ్‌ల నుంచి తరలిపోతున్న నిధులే ఇందుకు నిదర్శనం.

ఉద్రిక్తతలు తగ్గుతాయని..

యూరప్‌తోపాటు పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్తతలు తగ్గుముఖం పడుతాయన్న అంచనాలు కూడా పసిడి ధరల్ని కిందకు లాగుతున్నాయి. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నికైతే రాజకీయ, భౌగోళిక పరిస్థితుల్లో మార్పు ఉంటుందన్న విశ్వాసం మెజారిటీ మదుపరుల్లో కనిపిస్తున్నది.

డాలర్ ఇండెక్స్

ట్రంప్ గెలుపుతో ప్రపంచ కరెన్సీగా పేరున్న అమెరికా డాలర్లకు భారీగా డిమాండ్ వచ్చిపడింది. ఈ క్రమంలోనే డాలర్ ఇండెక్స్ పరుగులు పెడుతున్నది. దేశీయ మార్కెట్ నుంచి గతకొద్ది రోజులుగా తరలిపోతున్న విదేశీ పెట్టుబడులు సైతం అమెరికన్ మార్కెట్లలోకే చేరుతున్నాయి.

గ్లోబల్ మార్కెట్‌లో..

అంతర్జాతీయ మార్కెట్‌లోనూ పసిడి ధరలు నేలచూపుల్నే చూస్తున్నాయి. ఔన్సు గోల్డ్ విలువ రికార్డు స్థాయిల నుంచి దిగజారింది. కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో 2,557.40 డాలర్లు పలికింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గిస్తుండటం కూడా పుత్తడి మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది.

హైదరాబాద్‌లో అలెగ్రో పరిశోధన కేంద్రం

500 మంది సిబ్బందిని నియమించుకోనున్న సంస్థ

హైదరాబాద్, నవంబర్ 15: అమెరికాకు చెందిన మ్యాగ్నెటిక్ సెన్సింగ్ అండ్ పవర్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్(ఐసీ) సొల్యూషన్స్ సంస్థ అలెగ్రో మైక్రోసిస్టమ్స్..హైదరాబాద్‌లో రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్(ఆర్అండ్‌డీ)ని ప్రారంభించింది. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో వినీత్ నార్గోల్‌వాలా మాట్లాడుతూ..అంతర్జాతీయ స్థాయిలో పరిశోధన విభాగాన్ని మరింత బలోపేతం చేయడంలోభాగంగానే హైదరాబాద్‌లో నూతన ఆర్అండ్‌డీ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు, తెలంగాణలో శక్తివంతమైన సాంకేతిక పర్యావరణ వ్యవస్థలో భాగమైనందుకు సంతోషంగా ఉన్నదని, అలాగే దేశీయ సెమీకండక్టర్ ఆశయాలకు తమవంతుగా సహాయ సహకారాలు అందించనున్నట్లు చెప్పారు. నగరంలో ప్రతిభ కలిగిన ఉద్యోగులకు కొదవ లేదని, అనుకూల ప్రభుత్వ పాలసీలతో ఇక్కడి విస్తరణకు అనుకూలంగా మారిందన్నారు. ప్రస్తుతం ఆర్అండ్‌డీ కోసం 100 మంది ప్రతిభ కలిగిన సిబ్బందిని నియమించుకున్నట్లు, సమీప భవిష్యత్తులో ఈ సంఖ్యను 500కి పెంచుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. అంతర్జాతీయ ఆటోమొబైల్ దిగ్గజాలైన బీఎండబ్ల్యూ, అతిపెద్ద ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థలకు అలెగ్రో మైక్రోసిస్టమ్స్ కీలక విడిభాగాలను సరఫరా చేస్తున్నది.

ఆగని ఫారెక్స్ నిల్వల పతనం

ముంబై, నవంబర్ 15: విదేశీ మారకం నిల్వలు మరింత కరిగిపోయాయి. ఈ నెల 8తో ముగిసిన వారాంతానికిగాను ఫారెక్స్ రిజర్వులు 6.477 బిలియన్ డాలర్లు తరిగిపోయి 675.653 బిలియన్ డాలర్లకు పడిపోయాయని రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. అంతక్రితంవారంలోనూ నిల్వలు 2.675 బిలియన్ డాలర్లు తగ్గి 683.13 బిలియన్ డాలర్లకు తగ్గిన విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ 4.467 బిలియన్ డాలర్లు కరిగిపోయి 585.383 బిలియన్ డాలర్లకు పడిపోవడం వల్లనే మొత్తం రిజర్వులపై ప్రతికూల ప్రభావం పడిందని రిజర్వు బ్యాంక్ తన వార్షిక నివేదికలో వెల్లడించింది. అలాగే గోల్డ్ రిజర్వులు 1.936 బిలియన్ డాలర్లు తగ్గి 67.814 బిలియన్ డాలర్లకు పడిపోయాయి.

దిద్దుబాటు దిశగా మార్కెట్లు

- ఆల్‌టైమ్ హై నుంచి 10 శాతానికి పైగా క్షీణించిన దేశీయ ఈక్విటీలు

న్యూఢిల్లీ, నవంబర్ 15: ఈ ఏడాది దేశీయ స్టాక్ మార్కెట్లు ఎన్నో కొత్త రికార్డులను నెలకొల్పాయి. అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) రెండూ ఆల్‌టైమ్ హైలతో అదరగొట్టాయి. అయితే ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. గతకొద్ది రోజులుగా సూచీలు వరుస నష్టాలకే పరిమితమవుతున్నాయి మరి. ఈ క్రమంలోనే సెప్టెంబర్‌లో రికార్డు స్థాయిల నుంచి గమనిస్తే.. సెన్సెక్స్, నిఫ్టీలు 10 శాతానికిపైగా పడిపోయాయి. మరికొద్ది రోజులూ దిద్దుబాటు దిశగానే ఈక్విటీ మార్కెట్లు పయనించవచ్చన్న అంచనాలున్నాయి.

ఇదీ సంగతి..

దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాలకు అనేక కారణాలు కనిపిస్తున్నాయి. వాటిలో చైనా ఉద్దీపనలతో విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) భారతీయ మార్కెట్ నుంచి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుపోతుండటం కూడా ఉన్నది. గత నెలలోనే రూ.94,000 కోట్లు తరలిపోయాయి. అలాగే ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను ఆయా సంస్థలు ప్రకటిస్తున్న నిరాశాజనక ఆర్థిక ఫలితాలూ కారణమే. అంతేగాక మదుపరుల లాభాల స్వీకరణ, అమెరికా బాండ్ ఈల్డ్స్ పెరగడం, డాలర్ ఇండెక్స్ పరుగులు పెడుతుండటం కూడా ఉన్నాయి. సెప్టెంబర్ 27న సెన్సెక్స్ ఆల్‌టైమ్ హై 85,978.25 పాయింట్లను చేరింది. తొలిసారి నిఫ్టీ కూడా 26,277.35 పాయింట్లను తాకింది. అయితే అక్టోబర్ నుంచి మార్కెట్లలో బేరిష్ ట్రెండ్ మొదలైంది. ఈ క్రమంలోనే ఆల్‌టైమ్ హై స్థాయి నుంచి చూస్తే ప్రస్తుతం సెన్సెక్స్ 8,397.94 పాయింట్లు లేదా 9.76 శాతం కోల్పోయింది. నిఫ్టీ సైతం 2,744.65 పాయింట్లు లేదా 10.44 శాతం పడిపోయింది.

సింగరేణి అదుర్స్

హైదరాబాద్, నవంబర్ 15 (నమస్తే తెలంగాణ) : సింగరేణి సంస్థ లాభాల్లో దూసుకెళుతున్నది.ఈ ఏడాది మొదటి అర్థభాగంలోనే అధనంగా వెయ్యికోట్లకు పైగా లాభాలు గడించినట్టు సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరాం తెలిపారు. ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్యకాలానికిగాను పన్ను చెల్లింపులకు ముందు రూ. 4 వేల కోట్ల స్థూల లాభాన్ని ఆర్జించినట్టు పేర్కొన్నారు. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.2,932 కోట్లతో పోలిస్తే 36 శాతం అధికమని చెప్పారు. అలాగే బొగ్గు అమ్మకాల ద్వారా రూ.17,152 కోట్లు, విద్యుత్తు విక్రయాల ద్వారా రూ.2,286 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు.

ప్రియంకానున్న బెంజ్ కార్లు

జనవరి 1 నుంచి 3 శాతం వరకు పెరగనున్న ధరలు

న్యూఢిల్లీ, నవంబర్ 15: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్-బెంజ్ మరోసారి కార్ల ధరలను పెంచబోతున్నట్లు ప్రకటించింది. జనవరి 1 నుంచి అమలులోకి వచ్చేలా అన్ని రకాల కార్ల ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఉత్పత్తి వ్యయం అధికమవడం, ద్రవ్యోల్బణం ఒత్తిడి, నిర్వహణ ఖర్చులు అధికమవడం వల్లనే కార్ల ధరలను పెంచాల్సి వస్తున్నదని పేర్కొం ది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో జీఎల్‌సీ మాడల్ రూ.2 లక్షల వరకు అధికమవనుండగా, టాప్-ఎండ్ మాడల్ మేబ్యాక్ ఎస్680 లగ్జరీ కారు రూ.9 లక్షల వరకు పెరగనున్నది. గడిచిన మూడు త్రైమాసికాలుగా ముడి సరుకుల ధరలు పెరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు, ముఖ్యంగా కమోడిటీ ఉత్పత్తుల ధరలు 10 శాతానికి పైగా అధికమయ్యాయని, దీంతో పాటు లాజిస్టిక్ ఖర్చులు కూడా పెరిగాయని మెర్సిడెజ్-బెంజ్ ఇండియా ఎండీ, సీఈవో సంతోష్ తెలిపారు. డిసెంబర్ 31 లోపు బుకింగ్‌చేసుకున్న వాహనాలకు ఈ ధరల పెంపు నుంచి మినహాయింపు లభించనున్నదన్నారు. ప్రస్తుతం సంస్థ రూ.45 లక్షల నుంచి రూ.3.6 కోట్ల లోపు పలు మాడళ్లను దేశీయంగా విక్రయిస్తున్నది.

పొట్టకూటి కోసం వచ్చి.. రోడ్డు ప్రమాదంలో మృతి

- రామంచ క్రాసింగ్ వద్ద కారు ఢీకొని ఇద్దరు కార్మికుల దుర్మరణం
- చికిత్స పొందుతూ కారు డ్రైవర్ కన్నుమూత

ఘటనా స్థలంలో దెబ్బతిన్న కారు

తిమ్మాపూర్, నవంబర్ 15: పొట్టకూటి కోసం రాష్ట్రం దాటి వచ్చిన యువకులను రోడ్డుప్రమాదం కబలించింది. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి శివారులో శుక్రవారం సాయంత్రం కారు ఢీకొని ఇద్దరు యువకులు, కారు డ్రైవర్ మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి శివారులోని ఓ రైస్ మిల్లులో పని చేసేందుకు బీహార్‌కు చెందిన కొంత మంది యువకులు కొద్దిరోజుల కింద పనికి వచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం సరుకులు కొనుక్కునేందుకు ధీరజ్ కుమార్(23), సికిందర్ మండల(25), లక్ష్మణ్‌కుమార్ అనే ముగ్గురు కొత్తపల్లి స్టేజీ వద్దకు వెళ్లి తిరిగి రాజీవ్ రహదారిపై ఎడమ వైపు నుంచి వెళ్తున్నారు. స్టేజీ దాటిన అనంతరం రామంచ క్రాసింగ్ వద్ద చీకట్లో రోడ్డుపై వెళ్తున్న వారిని సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన తాడూరి వెంకట్‌రెడ్డి(53) అనే వ్యక్తి కారును అతివేగంగా నడుపుకొంటూ వచ్చి వారిని వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో ధీరజ్ కుమార్, సికిందర్ మండల అక్కడికక్కడే మృతిచెందారు. లక్ష్మణ్‌కుమార్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. వీరిని ఢీ కొట్టిన వెంటనే భయాందోళనకు గురైన వెంకట్‌రెడ్డి డివైడర్‌ను ఢీకొట్టగా, కారు పల్టీలు కొట్టడంతో ఆయన వాహనం నుంచి బయట పడిపోయాడు. రోడ్డు పక్కన ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన రేలింగ్ తలకు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని కరీంనగర్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న ఎల్ఎండీ పోలీసులు యువకుల మృతదేహాలను కరీంనగర్ దవాఖానకు తరలించారు. పొట్టకూటి కోసం వచ్చిన యువకులు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో తోటి కార్మికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మృత శిశువుతో దవాఖాన ఎదుట ఆందోళన



మృతశిశువుతో కుటుంబ సభ్యులు

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 15: వైద్యుల నిర్లక్ష్యంతో నవజాత శిశువు మృతిచెందిందని శుక్రవారం ప్రభుత్వ ఏరియా దవాఖాన ఎదుట పట్టణంలోని బుడగజంగాల కాలనీకి చెందిన గంధం రాజేశ్వరి, కుటుంబ సభ్యులు శిశువు మృతదేహంతో ఆందోళనకు దిగారు. వారి కథనం ప్రకారం.. కరీంనగర్‌కు చెందిన కళ్లెం లక్ష్మి గర్భిణి. పట్టణంలో నివాసముండే తన తల్లి గంధం రాజేశ్వరి వద్దకు వచ్చింది. గురువారం పురిటినొప్పులు తీవ్రం కావడంతో సాయంత్రం ప్రభుత్వ దవాఖానకు వచ్చింది. పరీక్షించిన వైద్యులు స్కానింగ్ తీసుకోవాలని సూచించగా, జమ్మికుంటలోని ప్రైవేటు స్కానింగ్ సెంటర్‌కు వెళ్లి రాత్రి 9 గంటలకు మళ్లీ ఏరియా దవాఖానకు వచ్చారు. స్కానింగ్ రిపోర్ట్ పరీక్షించి, వెంటనే ఆపరేషన్ చేయాలని చెప్పిన వైద్యులు, నిర్లక్ష్యం వహించి అర్ధరాత్రి సుమారు 12.40 గంటల ప్రాంతంలో సిజేరియన్ చేసినట్టు లక్ష్మి కుటుంబ సభ్యులు తెలిపారు. ఆడశిశువు ఎలాంటి కదలికలు లేకపోవడంతో ఉమ్మనీరు మింగిందని, ఆక్సిజన్ సపోర్ట్ అందించి, అత్యవసర చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించాలని వైద్యులు సూచించినట్టు తెలిపారు. కాగా, కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే శిశువు చనిపోయిందని అక్కడి వైద్యులు చెప్పారు. దీంతో హుజూరాబాద్ ప్రభుత్వ ఏరియా దవాఖాన ఎదుట ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులు.. నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదైంది. ఈ విషయమై వైద్యులను వివరణ కోరగా.. సాధారణ ప్రసవం కోసం ప్రయత్నించామని, నిపుణుల ఆధ్వర్యంలో శిశువుకు అన్ని పరీక్షలు నిర్వహించామని తెలిపారు.

పోలీసుల ఔదార్యం

రాంనగర్ నవంబర్ 15: స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఔదార్యాన్ని చాటుతున్నారు ఏఆర్ 1995 బ్యాచ్ పోలీసులు. కరీంనగర్‌లోని 18వ డివిజన్ రేకుర్తిలో గల ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు బట్టలు ఆరేసుకునేందుకు షెడ్డు లేదని తెలుసుకొని, సుమారు 50 వేల రూపాయలతో నిర్మించి శుక్రవారం వినియోగంలోకి తీసుకొచ్చారు. అలాగే విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని నర్మద, అధ్యాపకులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఏఆర్ 1995 బ్యాచ్‌కి చెందిన పోలీసులు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డుల జారీ ఏమైంది?

- పట్టభద్రుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దయాల ఓంప్రసాద్

కలెక్టరేట్, నవంబర్ 15: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు కొత్త రేషన్‌కార్డులు ఇంకెప్పుడు జారీ చేస్తారో చెప్పాలని తెలంగాణ పట్టభద్రుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దయాల ఓంప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ముకరంపురలో గల ఆసంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా ముఖ్య ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై 11 నెలలు గడుస్తున్నా, నిరుపేదలు, సామాన్యులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మాత్రం అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రేషన్‌కార్డు మాత్రమే గీటురాయి కాగా, అదిగో, ఇదిగో మంజూరు చేస్తున్నామంటూ ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం కావటం విడ్డూరమన్నారు. రేషన్‌కార్డుల మంజూరు కోసం మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటైనా, ఇప్పటివరకు ఒక్క సమావేశం కూడా ఏర్పాటు చేసి, నిర్ణయం తీసుకోకపోవడం శోచనీయమన్నారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయమని చెప్పుకొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం అదే స్థాయిలో సంక్షేమ పథకాలు పేదలకు అందించేందుకు కృషి చేయాలన్నారు. అర్హులైన ప్రజలకు సత్వరమే కొత్త రేషన్‌కార్డులు జారీ చేసి, ఆశావహుల జీవితాల్లో వెలుగులు నింపితేనే, ఇచ్చిన హామీలు అమలైనట్లని స్పష్టం చేశారు. దీనిపై సీఎం రేవంత్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఐకె రెడ్డి ప్రత్యేక చొరవ చూపితేనే కార్డుల జారీ సాధ్యమవుతుందన్నారు. అంతకుముందు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వినియోగించుకునేందుకు పట్టభద్రుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఓటరు నమోదు వివరాలు, మండలాల వారీగా సమావేశానికి వచ్చిన ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. తమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన డ్రైవ్‌తో కరీంనగర్ పట్టభద్రుల సెగ్మెంట్ పరిధిలోని ఉమ్మడి నాలుగు జిల్లాల్లో గతంలో కన్నా అత్యధిక సంఖ్యలో పట్టభద్రులు ఓటరు నమోదు దరఖాస్తులు చేసుకున్నారని వెల్లడించారు. వారందరికి ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు కె.తిరుపతి, వి.భాస్కర్, ఎస్.రాములు, సుదగోని మల్లేశం, బైరం రామయ్య, జక్కని నందకుమార్, దుగ్గిరాల శ్రీనివాసరావు, గుండు మల్లేశం, ముత్తినేని వెంకటేశ్వరరావు, రాగుల రాములు, జైపాల్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

తెలంగాణ పవర్ ఇంజినీర్స్ కార్యవర్గం ఎన్నిక

అంజయ్య, సెక్రటరీ | జీ రఘు, ట్రెజరర్ | ఎం రమేశ్, ట్రాన్స్ కో వైస్ ప్రెసిడెంట్ | కే రాజు, కంపెనీ ఆర్గనైజింగ్ సెక్రటరీ

ముకరంపుర, నవంబర్15: తెలంగాణ పవర్ ఇంజినీర్స్ జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా బ్రాంచి సెక్రటరీగా నాయిని అంజయ్య, ట్రెజరర్‌గా జీ రఘు, కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా స్వామి, పెద్దపల్లి జిల్లా కార్యదర్శిగా ప్రభాకర్, జగిత్యాల జిల్లా కార్యదర్శిగా ప్రసాద్, జాయింట్ సెక్రటరీగా శశికాంత్, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా షరీఫ్, ప్రదీప్, అనిల్, ఆడిట్ కమిటీ మెంబర్‌గా గట్టయ్య, అదనపు కార్యదర్శిగా సంతోష్, రమాకాంత్, పూర్ణచందర్ ఎన్నికయ్యారు. తమ ఎన్నికకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కరీంనగర్ ఉమ్మడి జిల్లా బ్రాంచి సెక్రటరీ నాయిని అంజయ్య కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఎన్నికలో జిల్లాకు చెందిన ఎం రమేశ్ ట్రాన్స్‌కో వైస్ ప్రెసిడెంట్‌గా, కే రాజు కంపెనీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికయ్యారని కరీంనగర్ బ్రాంచి సెక్రటరీ తెలిపారు.

ఆలయ పాలకవర్గ సభ్యులుగా అవకాశమివ్వాలి

నాయీబ్రాహ్మణ ఐక్య వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజ పడుగు హరిప్రసాద్



మాట్లాడుతున్న తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్య వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

తెలంగాణచౌక్, నవంబర్15: రాష్ట్రంలోని అన్ని దేవాలయ పాలకవర్గాల్లో నాయీబ్రాహ్మణులను పాలకవర్గసభ్యులుగా నియమించాలని తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్య వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజ పడుగు హరి ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్ని దేవాలయాలతో పాటు ప్రముఖ పుణ్య క్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానంలో పాలకవర్గ సభ్యులుగా నాయీబ్రాహ్మణులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. అనాదిగా దేవాలయాల్లో దేవుడి మేలుకొల్పుతోపాటు మొక్కులు పెట్టిన భక్తుల తలనీలాలను నాయీబ్రాహ్మణులే తీస్తున్నారని పేర్కొన్నారు. ఎలాంటి మౌలిక వసతులు లేకున్నా దేవుడి సేవలో ఉంటున్నారన్నారు. దేవాలయాల్లో నాయీబ్రాహ్మణులను పాలకవర్గ సభ్యులుగా నియమించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తే రాష్ట్ర వ్యాప్తంగా కల్యాణకట్టల్లో పని చేస్తున్న నాయీబ్రాహ్మణులతో కలిసి ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, జిల్లా నాయకులు శ్రీనివాస్, శ్రీరాముల రమేశ్, అంజన్న, మహేశ్, మహేందర్ పాల్గొన్నారు.

గ్రూపు-4 ఉద్యోగాలకు ఎంపికైన జిల్లా వాసులు

దేవేందర్‌రెడ్డి | వెంకటేశ్

వీణవంక/జమ్మికుంట/చొప్పదండి, నవంబర్ 15: టీజీపీఎస్సీ గురువారం ప్రకటించిన గ్రూప్-4 పరీక్షా ఫలితాల్లో జిల్లాకు చెందిన అభ్యర్థులు ఎంపికై సత్తాచాటారు. వీణవంక మండలం దేశాయిపల్లి గ్రామానికి చెందిన గాలేటి దేవేందర్‌రెడ్డి జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించగా, గ్రామస్తులతో పాటు మండల ప్రజాప్రతినిధులు అభినందించారు. అలాగే, జమ్మికుంట పట్టణానికి చెందిన అరువూరి రాహుల్‌రాజు మంచిర్యాల మిషన్ భగీరథ సీఈ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగానికి, చొప్పదండి పట్టణానికి చెందిన బొడిగె వెంకటేశ్ సిద్దిపేట జిల్లాలోని రెసిడెన్షియల్ స్కూల్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. కాగా, వెంకటేశ్ ఇప్పటికే గ్రూప్-1 ప్రిలిమ్స్ క్వాలిఫై అయి మెయిన్స్‌కు సైతం సెలెక్ట్ అయ్యాడు.

సీపీఎం జిల్లా మహాసభలు విజయవంతం చేయాలి

హుజూరాబాద్ టౌన్, నవంబర్15: కరీంనగర్‌లోని కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్‌లో ఈనెల 29,30 తేదీల్లో జరుగబోయే భారత కమ్యూనిస్టు (మార్క్సిస్ట్) పార్టీ జిల్లా పదో మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి పార్టీశ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా మహాసభల్లో ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి, భవిష్యత్ పోరాటాలకు రూపకల్పన చేయనున్నట్లు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, వెంటనే వాటని నెరవేర్చాలని, లేదంటే ప్రజా ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం హుజూరాబాద్ మండల కార్యదర్శి కొప్పుల శంకర్, సైదాపూర్ మండల కార్యదర్శి గుండేటి వాసుదేవ్, నాయకులు కదిరి రమేశ్, వడ్ల రాజు, ఎండీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను బేషరతుగా విడుదల చేయాలి

కలెక్టరేట్, నవంబర్ 15 : తమ భూములు లాక్కోవద్దంటూ ఆందోళనకు దిగిన రైతులను అరెస్టు చేసి, చర్లపల్లి జైలులో పెట్టడం అత్యంత హేయనీయమని, వెంటనే వారిని బేషరతుగా విడుదల చేయాలని తెలంగాణ కర్షక వేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇ. రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల ఆసంఘం జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. తరతరాలుగా వ్యవసాయం చేసుకుంటున్న రైతు కుటుంబాలను బెదిరింపులకు గురిచేసి, బలవంతంగా వారి భూములు లాక్కునే ప్రయత్నం చేసిన అధికారయంత్రాంగాన్ని అడ్డుకోవడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. లగిచర్ల ప్రాంతంలో ఫార్మా కంపెనీ ఏర్పాటును ఆదినుంచి వ్యతిరేకిస్తున్న అక్కడి రైతుల సమ్మతి లేకుండానే ప్రజాభిప్రాయ సేకరణ చేయడం సమంజసంకాదన్నారు. రైతులు తమ జీవనాధారమైన వ్యవసాయం దూరమైతే, వారి కుటుంబాలు వీధిన పడుతాయనే భావనతోనే అధికారులను అడ్డుకున్నారన్నారు. రైతుల ఆవేదన రాజకీయాలకు మళ్లించడం సముచితం కాదని, రైతుల నిర్ణయంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని గుర్తించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జైలు జీవితం నుంచి రైతులకు మోక్షం కలిగించాలని కోరారు. ఈ సమావేశంలో ఆసంఘం నాయకులు వెంకటరెడ్డి, మహిపాల్‌రెడ్డి, రాజలింగం, రాంమోహన్‌రెడ్డి, సత్యంరావు, తిరుమలరావు, మల్లేశం, శ్రీహరి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

DIWALI BLOCKBUSTER 3వ వారం



దేవి 70 ఎంఎం ఎ/సి - ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ 11.00,2.30,6.00,9.15
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

విశ్వనాథ్ - కూకట్‌పల్లి 11.45,2.45,6.45,9.45 | శ్రీరాములు - మూసాపేట్ 6.30,9.30
ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ 11.00,6.00 | రాజధాని డీలక్స్ - దిల్‌సుఖ్‌నగర్ 6.00,9.00
ఏషియన్ లక్ష్మీకళ - మూసాపేట్ 11.25,2.40,9.45 | వెంకటరమణపద్మావతి - కాచిగూడ 9.30PM